


**సింహగర్జనకు 24 ఏండ్లు పూర్తి** › కరీంనగర్‌లో నిర్వహించిన సింహగర్జనకు హాజరైన అశేష జనవాహినికి అభివాదం చేస్తున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ (ఫైల్)

# నాటి 'సింహగర్జన' చెరగని సంతకం

- ఆ ఉద్యమ సభకు 24 ఏండ్లు పూర్తి
- కేసీఆర్ సంకల్ప బలానికి నిదర్శనం
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్ మే 17 (నమస్తేతెలంగాణ): ప్రత్యేక రాష్ట్ర సాధనకు పునాది వేస్తూ కరీంనగర్ వేదికగా నిర్వహించిన తెలంగాణ సింహగర్జన సభ ఉద్యమ చరిత్రలో చెరగని సంతకమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభివర్ణించారు. ఆ మహాఘట్టానికి శనివారం (మే 17)తో 24 ఏండ్లు నిండటం చరిత్రాత్మకమని పేర్కొన్నారు. ఉద్యమ రథ సారథిగా కేసీఆర్ ఆ నాడు పూరించిన సమరశంఖం ఢిల్లీ వరకూ ప్రతిధ్వనించిన అపూర్వ సందర్భం అదేనని గుర్తుచేశారు. తెలంగాణ నలువైపుల నుంచి లక్షలాదిగా తరలివచ్చిన జనప్రవాహం సముద్రాన్నే తలపించిన అపూర్వ సన్నివేశమని శనివారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. తెలంగాణ వచ్చేదా? సచ్చేదా? అని ఆ నాడు ఎందరో అవమానించినా, అవహేళన చేసినా వెన్ను చూపని ఆ ధీరోదాత్తుడి సంకల్ప బలానికి ఆ సభే నిదర్శనమని తెలిపారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ కేసీఆర్ ఒక్కరితో మొదలైన ఆనాటి ప్రయాణం.. అనుకున్న గమ్యాన్ని ముద్దాడటం ఒక చారిత్రక విజయమని కొనియాడారు. ఉద్యమ నాయకుడే ఉత్తమ పాలకుడై సాధించిన తెలంగాణను పదేండ్లలోనే దేశానికి దారిచూపే దీపస్తంభంలా తీర్చిదిద్దిన దార్శనికత ప్రతి తెలంగాణ బిడ్డకు ఎప్పటికీ గర్వకారణమేనని పునరుద్ఘాటించారు.

# ఐటీడీఏలు నిర్వీర్యం

- చెంచుల జీవనం.. నరకప్రాయం!
- చెంచుపెంటల్లో దయనీయ స్థితి
- సమస్యల వలయంలో గిరిజనులు
- దరిచేరని సంక్షేమ పథకాలు
- ఐటీడీఏలో వేధిస్తున్న ఖాళీలు
- మన్ననూరులో ఏక్ నిరంజన్
- ఒకే సీనియర్ అసిస్టెంటుతో సరి
- ఉట్నూరు, ఏటూరునాగారం, భద్రాచలం ఐటీడీఐల్లోనూ అంతంతే
- ఏటూరునాగారంలో పోస్టుల ఖాళీ
- తాగునీరుకు దిక్కులేని చోట సాగునీరుకు 12,600 కోట్లు!
- నేడు 'ఇందిరా సౌరగిరి జలవికాస' పథకం ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



మాచారంలో 'ఇందిరా సౌరగిరి జలవికాస' పథకం కింద ప్రయోగాత్మకంగా చేపట్టిన సోలార్ విద్యుత్తు ప్లాంటు

హైదరాబాద్, మే17(నమస్తే తెలంగాణ): ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లోని 150 చెంచుపెంటల్లో కలిపి 14,436 మంది చెంచులు జీవిస్తున్నారని అధికారిక గణాంకాలు చెప్తున్నాయి. వీరి సంక్షేమం కోసం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరు కేంద్రంగా తెలంగాణ ప్రభుత్వం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)ను ఏర్పాటు చేసింది. చెంచుల జనాభా, పెంటల విస్తరణను బట్టి ఐటీడీఏలో ఒక పీవో, ఏపీవో జనరల్, ఏపీవో విద్య, కార్యాలయ మేనేజర్, అకౌంట్స్ మేనేజర్, ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లు, ఐదుగురు జూనియర్ అసిస్టెంట్లు, ముగ్గురు వ్యవసాయాధికారులు, ఐదుగురు వ్యవసాయ విస్తరణాధికారులు, వైద్య ఆరోగ్యశాఖాధికారి, ఇద్దరు హెడ్‌నర్సులు, 8 మంది స్టాఫ్ నర్సులు, ఇంజినీర్ తదితర అధికారుల అవసరం ఉన్నది. కానీ, ఐటీడీఏ మన్ననూరు కార్యాలయంలో ఒకే ఒక సీనియర్ అసిస్టెంటు మాత్రమే పనిచేస్తున్నారు. ఈ ఒక్క ఉద్యోగికి మూడు ఉమ్మడి జిల్లాల్లో చెంచుల పథకాల పర్యవేక్షణ కష్టంగా మారుతున్నది. కోట్లకు కోట్లు కరిగిపోతున్నా చెంచులకు గుప్పెడు పోషకాహారం, గుక్కెడు రక్షిత తాగునీరు అందించలేని దుస్థితిలో ఐటీడీఏ ఉన్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో కర్నూలు జిల్లా సున్నిపెంటలో ఐటీడీఏ ఉండేది. దీంతో సమస్యల పరిష్కారం కోసం 70 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేది. మన్ననూరులో ఐటీడీఏ ఏర్పాటుతో సమస్యలు పరిష్కారమవుతాయని భావించిన చెంచులకు నిరాశే మిగిలింది. ఐటీడీఏ ఏర్పాటైనా అధికారులు లేకపోవడంతో సంక్షేమ పథకాలు చెంచులకు చేరడం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అచ్చంపేట పరిధిలో రూ. 12 లక్షలు మాత్రమే విదిలించి కొన్ని చెంచు పెంటలకు తాగునీటి వసతి కల్పించినట్టు స్థానికులు చెప్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ అటవీప్రాంతంలోని మాచారం గ్రామంలో 'ఇందిరా సౌరగిరి జల వికాస' పథకాన్ని ప్రారంభించబోతున్నారు. ఈ పథకం కింద రాబోయే ఐదేండ్లలో రూ. 12,600 కోట్లతో గిరిజన రైతులకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తాగునీరు అందించని చోట, సాగునీటి పథకం ప్రారంభిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

### ఐటీడీఏ ఏం చేయాలంటే?

చెంచుల కోసం అమలు చేస్తున్న పథకాల్లో ప్రధానమైన వ్యవసాయం, పండ్ల తోటల పెంపకం, వైద్య ఆరోగ్యం, ఉపాధిహామీ, స్వయం సహాయక సంఘాలు, పెసా చట్టం అమలు, స్త్రీ శిశు సంక్షేమ కార్యక్రమాలు, అటవీ ఆధారిత పథకాలు, విద్య, సాగునీరు భూ అభివృద్ధి, గృహనిర్మాణం, ఇంజినీరింగ్ విభాగం, గిరిజన సహకార సంస్థ కార్యక్రమాలను ఇతర శాఖలతో సమన్వయం చేస్తూ చెంచుల సంక్షేమ పథకాలను అమలు చేయడమే ఐటీడీఏ పని. జీవో నంబర్ 57 ప్రకారం ప్రిమిటివ్ ప్రాంతం అంతా సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్ కిందికి వస్తుంది. అన్ని ప్రభుత్వ శాఖలు ఐటీడీఏ పీవో పరిధిలోకి వస్తాయి. పీవో ఆదేశాల మేరకు వారు పనిచేయాల్సి ఉంటుంది. గిరిజనుల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించినా, కేటాయించకపోయినా ప్రతి ఏడాది ఐటీడీఏకు జిల్లా పరిషత్ ఇయర్‌మార్క్ ఫండ్, మండల పరిషత్ ఇయర్‌మార్క్ ఫండ్, కేంద్ర ప్రభుత్వం నుంచి సీసీడీపీ ఫండ్ ఉంటుందని, ఐటీడీఏకు రెగ్యులర్ పీవో నిధులపై సమీక్ష చేసి ఆయా జిల్లా పరిషత్తుల నుంచి, మండల పరిషత్తుల నుంచి రావాల్సిన బకాయిలను చెంచుల సంక్షేమం కోసం ఉపయోగించుకునేవారని ప్రజా సంఘాల నేతలు చెప్తున్నారు. రెగ్యులర్ అధికారులు లేక దిగువస్థాయి అధికారులు తక్షణ నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు. దీంతో పథకాల అమలు నత్తనడకన సాగుతున్నది. అత్యవసర సమయాల్లో తక్షణ సాయం అందక చెంచులు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా వైద్యం, తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. వేసవిలో లోతట్టు అటవీ ప్రాంతంలోని చెంచులు తాగునీటి కోసం చెలిమెలపైనే ఆధారపడుతున్నారు. దీంతో చెంచుల జీవన ప్రమాణాలు వేగంగా పడిపోతున్నాయి. పోషకాహార లోపం, రక్తహీనత, అనారోగ్యాలతో 50 ఏళ్లలోపే గిరిజనులు చనిపోతున్నారని స్వచ్ఛంద సంస్థలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి.

### ఇండ్లు దాటిన కొల్లాపూర్ చెంచుల దీనస్థితి

గతంలో కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని నల్లమల అటవీప్రాంతం నుంచి 16 పెంటల చెంచులను బలవంతంగా తీసుకొచ్చి మొలచింతలపల్లి సమీపంలోని భ్రమరాంబిక కాలనీలో వదిలిపెట్టారు. వారికి ప్రభుత్వం ఎలాంటి ఆశ్రయం కల్పించలేదు. ఆర్డీటీ ముందుండి వారికి ఇండ్లు కట్టించింది. ఆ తరువాత కుటుంబంలో ఉన్న జనాభాను బట్టి ఒక్కో చెంచు కుటుంబానికి ప్రభుత్వం 3 నుంచి 5 ఎకరాల చొప్పున పోడు పట్టాలు ఇచ్చింది. ఇంకొందరికి ప్రైవేటు వ్యక్తుల నుంచి కొనుగోలు చేసిన భూమిని పంచి ఇచ్చారు. అనంతరం వారిని మరిచిపోయారు. ఇప్పుడా భూములను ప్రభుత్వానికి అమ్మిన వ్యక్తులే ఆక్రమించి, చెంచుల ఇండ్ల వరకు వదిలేసి మొత్తం భూమిని దున్నుకోవడం మొదలు పెట్టారు. కనీసం కాలిబాటకు తొవ్వ కూడా ఇవ్వలేదు. చేతిలో పట్టాలు గానీ, ప్రభుత్వం చెంచులకు ఇచ్చినట్టు ఆధారాలు గానీ లేకపోవడంతో చెంచులు నిస్సహాయతలో ఉండిపోయారు. ఉపాధి లేక చెంచులు అదే పంట పొలాల్లో వ్యవసాయ కూలీలుగా కాలం గడుపుతున్నారు. అత్యంత దయనీయ పరిస్థితుల్లో జీవిస్తున్నారు. సరైన వైద్యం, పిల్లలకి చదువుకోడానికి సరైన పాఠశాలలు లేక ఇబ్బంది పడుతున్నారు. ఐటీడీఏ బలంగా ఉండి ఉంటే ఈ అన్ని పెంటల మీద పర్యవేక్షణ ఉండేది. అది లేకపోవటంతో అనాథలుగా గడపాల్సి వస్తున్నదని ఈదయ్య అనే చెంచు పెద్ద ఆవేదన వ్యక్తంచేశాడు.

### సీతక్క ఏరియాలోనూ ఇదే తంతు

రాష్ట్రంలో ఉట్నూరు, భద్రాచలం, ఏటూరునాగారం, మన్ననూరు ఐటీడీఏలు ఉన్నాయి. మన్ననూరు మినహాయిస్తే మిగతా మూడు ఐటీడీఏల్లో 208 పోస్టులకు గాను 116 ఖాళీగా ఉన్నాయి. కేవలం 92 మంది అధికారులు, ఉద్యోగులు మాత్రమే పనిచేస్తున్నారు. మంత్రి సీతక్క ఇలాకాలోనూ ఇదే తంతు. ఏటూరునాగారం ఐటీడీఏలో 20 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ గిరిజన సంక్షేమశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు(ఈఈ) పోస్టు కూడా ఖాళీగానే ఉన్నట్టు సమాచారం. ఉట్నూరు ఐటీడీఏ పరిధిలో గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో విద్యను పర్యవేక్షించే జిల్లా గిరిజన సంక్షేమాధికారులు, ఉపసంచాలకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆదిలాబాద్(ఉట్నూరు ఐటీడీఏ), మంచిర్యాల, నిర్మల్ జిల్లాలకు ఒకే అధికారి ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఉట్నూరు, బోథ్, ఆదిలాబాద్, మంచిర్యాల, కాగజ్‌నగర్, జైనూరులో సహాయ గిరిజన సంక్షేమాధికారి(ఏటీడీవో) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉట్నూరులో వ్యవసాయ, మత్స్యశాఖ, ఉద్యానశాఖ అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉట్నూరు, మంచిర్యాల, ఆసిఫాబాద్‌లో డిప్యూటీ ఇంజినీరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. భద్రాచలం ఐటీడీఏ పరిధిలో ఇల్లెందులో ఏటీడీవో పోస్టు, అశ్వారావుపేటలో డిప్యూటీ ఇంజినీరు, వ్యవసాయ, ఉద్యాన, మత్స్యశాఖ అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

# భారత్ గొప్పతనాన్ని చాటిచెప్పే సదవకాశం

- బ్రిటన్‌లో 'ఇండియా వీక్-25'లో కీలక ప్రసంగం
- పీడీఎస్ఎల్ ప్రారంభోత్సవ అవకాశం హర్షణీయం
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడి

హైదరాబాద్ మే 17 (నమస్తేతెలంగాణ): బ్రిటన్‌లో ఈ నెల 30న జరిగే 'ఇండియా వీక్-2025' సదస్సులో ప్రపంచంలో భారతదేశ గొప్పతనాన్ని చాటిచెప్పే సదవకాశం తనకు దక్కిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. బ్రిడ్జ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఆ సదస్సులో ప్రసంగించే అవకాశం తనకు దక్కిందని తెలిపారు. తెలంగాణ ఎందుకు ముఖ్యమైనది.. అనే అంశంపైనా తన మనోగతాన్ని అక్కడి గొప్పవారితో పంచుకుంటానని పేర్కొన్నారు. అదేరోజు ఐడియాస్ ఫర్ ఇండియా వార్విక్‌లో భాగంగా పీడీఎస్ఎల్ నాలెడ్జ్ సెంటర్‌ను ప్రారంభించే అవకాశాన్ని ఆ సంస్థ తనకు ఇవ్వడం సంతోషకరమని అన్నారు. ఒకేరోజు రెండు కీలక కార్యక్రమాల్లో తాను పాల్గొనడం ఆనందంగా ఉన్నదని కేటీఆర్ తెలిపారు.

# రాష్ట్రానికి రేవంత్ షార్ట్‌కట్ సీఎం

- 16 నెలల పాలన కాలమంతా స్కాములే!
- 6 గ్యారెంటీలు అటకెక్కించి అందాల పోటీలా?
- నిరంజన్‌రెడ్డి ధ్వజం



హైదరాబాద్, మే 17 (నమస్తే తెలంగాణ): 'తెలంగాణ రాష్ట్రానికి రేవంత్‌రెడ్డి షార్ట్‌కట్ సీఎంగా మారారు.. ఆయన తీసుకుంటున్న నిర్ణయాల్లో అనుభవరాహిత్యం, అపరిపక్వత కనిపిస్తున్నది' అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 16 నెలలు స్కామ్‌ల కాలంగా మారిందని దుయ్యబట్టారు. శనివారం ఆయన టీన్యూస్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలపై మాట్లాడారు. సర్కారు అవలంబిస్తున్న వైఖరిపై ప్రజల్లో విశ్వాసం కొరవడిందని నిప్పులు చెరిగారు. మంత్రులు డబ్బులు తీసుకుని పనులు చేస్తారన్న ఒక మంత్రి చేసిన వ్యాఖ్యలు ఉద్దేశపూర్వకంగా, వ్యూహాత్మకంగా ఉన్నాయని తెలిపారు. హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలును అటకెక్కించి, అందాల పోటీలు నిర్వహించడాన్ని తప్పుబట్టారు. ఈ పోటీల వల్ల రాష్ట్రానికి ఎలాంటి మేలు కలిగిందో చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ కుప్పకూలిందని, నగరం బ్రాండ్ ఇమేజ్ పడిపోయిందని ధ్వజమెత్తారు. సీఎం, మంత్రుల మధ్య సమన్వయం కొరవడిందని, మంత్రులు రెండు వర్గాలుగా చీలిపోయారని గుసగుసలాడుతున్నారని చెప్పారు.

### ప్రాజెక్టు విధానాల అమలు బాధ్యత పాలకులదే

ప్రాజెక్టుల నిర్మాణాల విషయంలో విధానాలను పాలకులు అమలు చేస్తారని, డిజైన్ మాత్రం అధికారులు, ఇంజినీర్లు చేస్తారని నిరంజన్‌రెడ్డి చెప్పారు. కాళేశ్వరం అనేది ప్రాజెక్టుల సముదాయమని, దాని కింద మూడు ప్రాజెక్టులు ఉన్నాయని, ప్రస్తుత పంటలకు ఈ నీళ్లే ఆధారమని తెలిపారు. అలాంటి ప్రాజెక్టుల నిర్మాణాల్లో కేసీఆర్ ముఖ్య భూమిక పోషిస్తే.. తప్పెలా అవుతుందని నిరంజన్‌రెడ్డి నిలదీశారు.

# మంత్రుల నుంచే రేవంత్‌కు ముప్పు!

- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొడ్తమని కేసీఆర్ అనలే
- మాజీ మంత్రి గంగుల కమలాకర్
- ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భారీ స్కాం : ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి



కరీంనగర్ కలెక్టరేట్ ఆవరణలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల. చిత్రంలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రసమయి, సుంకె, మాజీ ఎమ్మెల్సీ నారదాసు

కరీంనగర్, మే 17 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీని కూల్చి తాను సీఎం అవుతానని తమ పార్టీ అధినేత కేసీఆర్ ఎప్పుడూ చెప్పలేదని, ఆయనకు తన క్యాబినెట్ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితోనే ముప్పు ఉన్నదని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హెచ్చరించారు. రేవంత్ ప్రభుత్వం ఐదేండ్లపాటు కొనసాగాలని కేసీఆర్ ఆశీర్వదించారు తప్ప, ప్రభుత్వాన్ని కూల్చి అధికారంలోకి రావాలనే ఆలోచన బీఆర్‌ఎస్ పార్టీకి లేదని అన్నారు. కరీంనగర్ జిల్లాలో బీఆర్‌ఎస్ హయాంలో మంజూరై ఆగిపోయిన అభివృద్ధి పనులను కొనసాగించాలని కోరుతూ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్‌ఎస్ నాయకులు శనివారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం గంగుల మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే కేసీఆర్‌ను ఆడిపోసుకుంటున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డికి బీఆర్‌ఎస్ నుంచి ఎలాంటి భయం లేదని, ఆయనకు కింద పనిచేసే మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నుంచే పదవీ గండం ఉండే అవకాశం ఉందన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత పదేండ్లలో కరీంనగర్ జిల్లా ఎంతో అభివృద్ధి చెందిందని, అభివృద్ధితో కళకళలాడిన జిల్లా ఇప్పుడు కళావిహీనంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి కూడా విజ్ఞప్తి చేస్తున్నానని, కేంద్రం నుంచి నిధులు తెచ్చి డంపింగ్ యార్డు పనులు పూర్తి చేయాలని కోరారు. తమ హయాంలో నిర్మించిన చెక్‌డ్యాంలపై విజిలెన్స్ విచారణ చేసినా తామేమీ భయపడేది లేదని తేల్చి చెప్పారు.

### ఇందిరమ్మ ఇండ్లలో భారీ స్కాం: కౌశిక్‌రెడ్డి

ఇందిరమ్మ ఇండ్లలో భారీ స్కాం జరుగుతున్నదని, క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఒక్క ఇల్లు మంజూరుకు రూ. 50 వేలు లంచంగా తీసుకుంటున్నారని ఆరోపించారు. అర్హులందరికీ ఇండ్లు ఇవ్వాలని, ఈ విషయంలో రాజకీయాలు తగవని హితవు పలికారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులు పడుతున్న ఇబ్బందులను పట్టించుకోని ప్రభుత్వం అందాల పోటీలపై ఆసక్తి చూపుతున్నదని విమర్శించారు. అందాల పోటీల పేరిట రేవంత్‌రెడ్డి తెలంగాణ ఆడబిడ్డల పరువు తీశారని మండిపడ్డారు. ఎక్కడి నుంచో వచ్చిన వారి కాళ్లను తెలంగాణ ఆడబిడ్డలతో కడిగించేందుకు సీఎంకు ఎంత ధైర్యమని ప్రశ్నించారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో తమ ప్రభుత్వ హయాంలో పైలెట్ ప్రాజెక్టుగా అమలైన దళితబంధు రెండో విడత నిధులను విడుదల చేయాలని కలెక్టర్‌ను కోరినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

# పిడుగుపాటుకు ముగ్గురు మృతి

**తూప్రాన్‌లో ఇద్దరు బాలురు, కామారెడ్డి జిల్లాలో మేకల కాపరి..**




యశ్వంత్, ప్రసాద్ (ఫైల్)

తూప్రాన్/కామారెడ్డి మే 17 : రాష్ట్రవ్యాప్తంగా శనివారం పిడుగుపాటుకు గురై ముగ్గురు మృతి చెందారు. తూప్రాన్‌లో ఇద్దరు బాలురు, కామారెడ్డి జిల్లాలో ఓ మేకలకాపరి మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా తూప్రాన్ 11వ వార్డు పడాలపల్లికి చెందిన నడిపల్లి యశ్వంత్ (14), పంబల్ల ప్రసాద్ (14), మొకద్దం కిరణ్ శనివారం క్రికెట్ ఆడుదామని పడాలపల్లికి సమీపంలోని ఊరచెరువు మైదానంలోకి వెళ్లారు. క్రికెట్ ఆడుతుండగా గాలివాన రావడంతో చెట్లవైపు పరుగులు తీశారు. కాసేపటికే యశ్వంత్, ప్రసాద్, కిరణ్ తలదాచుకున్న చెట్టుపై పిడుగు పడింది. దీంతో నడిపల్లి యశ్వంత్, పంబల్ల ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందారు. కిరణ్ తీవ్రంగా గాయపడ్డాడు. కిరణ్‌ను మెరుగైన వైద్యం కోసం ములుగులోని ఆర్‌వీఎం దవాఖానకు తరలించారు. బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పడాలపల్లిలో బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి, రూ. 10 వేల తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలంలోని పరిధిపేట గ్రామానికి చెందిన మాదిరే సురేశ్ (28) రోజుమాదిరిగానే మేకలను మేపడానికి గ్రామశివారులోకి వెళ్లాడు. జీవాలను మేపుతుండగా ఒక్కసారిగా పిడుగు పడటంతో సురేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి రెండేండ్ల పాప, నెల వయసున్న బాబు ఉన్నాడని స్థానికులు తెలిపారు.

# డాలస్‌లో బీఆర్‌ఎస్ వేడుకలకు ఏర్పాట్లు

హైదరాబాద్ మే 17 (నమస్తేతెలంగాణ): డాలస్‌లో జూన్ ఒకటిన అట్టహాసంగా నిర్వహించనున్న బీఆర్‌ఎస్ సిల్వర్‌జూబ్లీ, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాల కోసం ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్టు బీఆర్‌ఎస్ యూఎస్‌ఏ విభాగం నాయకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేటీఆర్ హాజరుకానున్న ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటికే వాషింగ్టన్ డీసీ, లాస్ ఏంజెలిస్, కాలిఫోర్నియా, అట్లాంటా, జార్జియా నగరాల్లో సన్నాహక సమావేశాలు పూర్తయ్యాయని, వచ్చే 10 రోజుల్లో న్యూజెర్సీ, బేఏరియా(కాలిఫోర్నియా), చికాగో, హోస్టన్,డాలస్, న్యూయార్క్ నగరాల్లో సమావేశాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. తెలంగాణ నుంచి ప్రత్యేక అతిథిగా బాల్క సుమన్ హాజరై కార్యక్రమ ఏర్పాట్లు, ప్రచార వ్యూహాలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణపై దిశానిర్దేశం చేశారన్నారు. డాలస్‌లో వేడుకల్లో పాల్గొనేందుకు తెలంగాణ ప్రవాసీలు ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు.

# బంగాళాఖాతంలో భారీ తుఫాన్

**తెలుగు రాష్ట్రాల్లో ఏడు రోజులపాటు వర్షాలు**

**జూన్ 10 నాటికి తెలంగాణకు రుతుపవనాలు**

హైదరాబాద్, మే 17, (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం త్వరలో అల్పపీడనంగా మారి తుఫానుగా మారే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేస్తున్నది. దీనికి ఇప్పటికే 'శక్తి' అని నామకరణం చేశారు. శక్తి తుపాన్ వచ్చే రెండు వారాలపాటూ దక్షిణ అరేబియా సముద్రంలోని తీర ప్రాంతాల్లో ప్రభావం చూపించనున్నది. వచ్చే వారం రోజులు ఏపీ, తెలంగాణలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆదివారం గంటకు 50 నుంచి 60కిలోమీటర్ల వేగంతో గాలులు వీయనున్నాయి. తెలంగాణలో రోజంతా మేఘావృతమై ఉండే అవకాశం ఉంది. హైదరాబాద్ సహా తెలంగాణలోని 80శాతం ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయి. కాగా, నైరుతి రుతుపవనాలు జూన్ 10వ తేదీ నాటికి తెలంగాణకు వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ కేంద్రం తెలిపింది. రుతుపవనాలు జూన్ నెలాఖరు వరకు దేశమంతటా విస్తరిస్తాయి. ఈ నెల 20 తరువాత రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు బాగా తగ్గే అవకాశం ఉంది.


**జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ**
(రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం)

**బహిరంగ ప్రకటన**

ప్రాజెక్ట్ డైరెక్టర్, NHAI, PIU, మంచిర్యాల వారి పేరున NH-63 ఆర్మూర్ (డిజైన్ కి.మీ.29+100) నుండి మంచిర్యాల (డిజైన్ కి.మీ.160+995) (డిజైన్ పొడవు= కి.మీ.131.895) 4-లేన్ హైవే ఆర్మూర్-జగిత్యాల- మంచిర్యాల సెక్షన్ నిర్మాణం కొరకు 16.1864 హెక్టార్లు (నిజామాబాద్-5.4262 హెక్టార్లు) జగిత్యాల (3.9067 హెక్టార్లు) మరియు మంచిర్యాల (6.8535 హెక్టార్లు) అటవీ భూమిని మళ్లించుటకు అటవీ సంరక్షణ చట్టం,1980 లోని సెక్షన్ 2 క్రింద ''ఇన్-ప్రిన్సిపల్'' ఆమోదం (స్టేజ్-1)ను పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ (MOEF&CC), భారత ప్రభుత్వం **Pro. No. FP/TG/ROAD/493785/2024, తేది: 24-04-2025** ద్వారా సమ్మతించినది.
**Rc. No. FC1/FC03/9/2023, తేది: 03-05-2025** ద్వారా ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ & హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్, GoTS, హైదరాబాద్ వారి సూచనలకు అనుగుణంగా యూజర్ ఏజెన్సీ ద్వారా ఈ బహిరంగ ప్రకటన జారీచేయబడినది.
నిబంధనలు మరియు సేఫ్ గార్డ్స్‌తో స్టేజ్-1 ''ఇన్-ప్రిన్సిపల్'' ఆమోదం ఆర్డర్స్‌తో సహా ఆన్‌లైన్ ప్రతిపాదనల నెం. **FP/TG/ROAD/493785/2024** వివరాలను MoEF&CC, పరివేష్ పోర్టల్ (www.parivesh.nic.in) ద్వారా పొందవచ్చును మరియు దిగువ తెలిపిన QR కోడ్ ద్వారా యాక్సెస్ చేయవచ్చును.

సం/-
ప్రాజెక్ట్ డైరెక్టర్
NHAI, PIU-మంచిర్యాల

**రోడ్లనే కాదు, జాతి నిర్మాణం కూడా**



Skill India | Industrial Training Institute

LAST DATE TO SUBMIT APPLICATION 28.05.2025

**Government of India**
**Ministry of Skill Development & Entrepreneurship**
**Directorate General of Training**
REGIONAL DIRECTORATE OF SKILL DEVELOPMENT & ENTREPRENEURSHIP, TELANGANA

**ADMISSIONS NOW OPEN FOR CRAFT INSTRUCTOR TRAINING SCHEME (CITS) 2025-26**

**NATIONAL SKILL TRAINING INSTITUTE, VIDYANAGAR**

| | |
|---|---|
| FITTER | 100 SEATS |
| ELECTRICIAN | 100 SEATS |
| MECHANIC MOTOR VEHICLE (M.M.V) | 25 SEATS |
| MACHINIST | 25 SEATS |
| WELDER | 50 SEATS |
| INFORMATION TECHNOLOGY | 25 SEATS |

**NATIONAL SKILL TRAINING INSTITUTE (WOMEN) VIDYANAGAR**

| | |
|---|---|
| FASHION DESIGN & TECHNOLOGY | 50 SEATS |
| COSMETOLOGY | 50 SEATS |
| OFFICE MANAGEMENT | 25 SEATS |

**NATIONAL SKILL TRAINING INSTITUTE, RAMANTHAPUR**

| | |
|---|---|
| COMPUTER HARDWARE & NETWORK MAINTENANCE | 50 SEATS |
| COMPUTER SOFTWARE APPLICATION | 50 SEATS |
| ELECTRONICS MECHANIC | 50 SEATS |

ALL INDIA COMMON ENTRANCE TEST (AICET) WILL HELD ON 15.06.2025
ONLINE E-REGISTRATION OPEN FROM : 08.05.2025 TO 28.05.2025

40+ TRADES AVAILABLE AT PAN INDIA LEVEL

WHO CAN APPLY:
- Pass out trainees who have completed NTC / NAC / Diploma / Degree
- Candidates who are appearing for final examination of NTC / NAC / Diploma / Degree

For more details
www.nimionlineadmission.in